గల్పిక

# ఊరేగింపు

దత్తా దుర్గాప్రసాద్

బ్రిడ్జిదిగువ, టర్నింగులో; ఆగాడు దేవుడు. మహా సంరంభంగా ఉంది మెయిన్‌రోడ్డు. రాత్రి పన్నెండుగంటలైనా, కాంతివంతంగా వున్న గ్యాసులైట్లూ, ఆకాశాని కెగిరే తారాజువ్వలూ చీకటిఛాయల్ని పూర్తిగా పారద్రోలి వేశాయ్.

బంగారపు వర్తకులసంఘం ఏర్పాటుచేసిన ఊరేగింపు అది! ఎంతలేదన్నా అయిదారువేలైనా ఖర్చై, ఉంటాయట. అసలు పెద్దాపురంసాని మేళానికే రెండువేల రెండువందలట! పోతే బ్యాండుమేళానికో వేయి. ఇక గ్యాస్‌లైట్లూ, కూలీలు, కాఫీలు, తెల్లకాఫీలు... చెప్పాలా!?

మతాబాలు వందలకొద్దీ "తీగల చక్రానికి" గుచ్చి అంటిస్తున్నారు. గిఱ్ఱుమని తిరుగుతూ వింతగా కన్పించుతూ ఉందది. తారాజువ్వలు, ఆకాశానికి కెగిరి గంతులేనుతున్నాయ్. చిచ్చుబుడ్లు వరసబెట్టి డజన్లకొద్దీ అంటించుతున్నారు. సగంలో పగిలేవికొన్ని......

ఇంతకీ దేవుడు ఎక్కడ ఉన్నాడా అని చూచాను. అదుగో, పాపం! చచ్చిపోయాక అన్ని హంగుల్తోటీ ఫొటోతీయించుకొంటూన్న తాతయ్యలా ఉందాయనపరిస్థితి. బహుశా, ఈ పాటికి, ఆ బ్యాండు దెబ్బలకే ననండీ, లేక తన భక్తాగ్రేసరులు కోరుతూన్న విపరీతమైన కోరికలకే ననండీ ఆయనకి, చెవుడు వచ్చేవుంటుంది.

బ్యాండువాళ్ళు "రెడ్‌ఆర్మీ"లా బారులు తీర్చినిల్చున్నారు. "విధిరాకాసి..." అని గోల గోలగా మోగిపోతూవుంది. నా వెంట నడుస్తున్న, రవణమూర్తే వినిపించడంలే సరిగ్గా! ఇంకొంచెం ముందుకినడిస్తే మేళం ("మా గొప్ప"మేళంట!) నాట్యం చేస్తూవుంది. అయితే ఏమీకనపడ్డంలేదు! చుట్టూవందలమంది నిల్చొని ఉన్నారు. చల్లగా దారిచేసుకొని లోపలికి నడిచాం యిద్దరమూ.

లోపల నలుగురైదుగురు ఉక్కుగుండ్ల లాంటి మనుషులు, తూలుతూ, నానా బూతులూ మాట్లాడుతూ, చేతిలో కర్రలతో జనాన్ని అదుపులో పెడుతున్నారు. మధ్య ఓ అరడజనుమంది "అబలలు" (!!) పదిహేనూ, పాతికేళ్ళ మధ్య వాళ్లు, నిల్చునున్నారు. వాళ్ళవెనక ఓ నలభై అయిదేళ్ళముత్తైదు వీళ్ళందరికంటే ఎక్కువగా కులుకుతూ, 'కీ'యిచ్చిన కీలుబొమ్మలా, తలతెగ తిప్పుతూ, 'అమ్మనొప్పులే...' అంటూ అరుస్తూంది. దానికి తగ్గట్టు యీ అరడజనూ, ముందుకో అడుగూ, వెనక్కో అడుగూ, వేస్తూ తమ భయంకరవీక్షణాల్ని, రసికాగ్రేసరులమీద శరాలలా వదుల్తూన్నారు, ఇదేమీ తనకు పట్టనట్టు ఓ యాభైయేళ్ళ"కుర్రాడు" సీరియస్‌గా ఫిడేలు వాయించేసుకొంటున్నాడు, తన్మయత్వంలోపడి! "నేనేం తక్కువతిన్నానా!" అంటూ రెండోపక్క గుమ్మటంలాంటి మనిషొకడు, యిష్టమొచ్చినట్టు, బాదేస్తున్నాడు చేతులో "డోలుని" "వహ్వా!" "వహ్వా!" అంటూ గుంపులోనుంచి ప్రశంసావాక్యాలూ, దాంతోపాటే, నలిగిపోయిన నారింజతొక్కలూ, యింకా, సరసులైతే కుళ్ళిపోయిన అరటిపళ్ళూ, 'గురి'చూసి కొడ్తున్నారు.

ఇక ఈ ఉక్క భరించలేక బయటికొచ్చి, అరుగుమీదకెక్కాం. ఇంతలో ఓ విఘ్నేశ్వరుడు, కొంపంతా మునిగిపోతున్నట్లు 'భ్రు'నపరుగెత్తుకొంటూవచ్చి, లోపలికి దూరబోయి, యెవడో ఒక్కనెట్టు నెట్టేసరికి దొర్లుకుంటూపోయి, కిళ్ళీకొట్టు పక్క, కారా కిళ్ళీనమల్తున్న పచ్చకోక మీద పడ్డాడు. ఆ వనితారత్నం క్షణం మాలసించకుండా "దొంగనా..." అని పంచాంగం విప్పింది. బుంగమూతిపెట్టి, సీరియస్‌గా చూచాడు మన గున్నయ్య. సాభిప్రాయంగా నవ్విందామె. అంతే! ఇద్దరూకలిసి ఎటోపోయారు!!...ఊరేగింపు కదిలింది. బడిపంతులువెంట, కుర్రాళ్ళా, పోతున్నాడు దేవుడు.

"ఆహారాహూ..." అంటోంది బ్యాండు.

"పదరాబాబూ"అన్నాడురవణఅదేస్టయిల్లో.